# భగీరథ నీటిని అందించాలి



కోరుట్ల : సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల



ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్లను సన్మానిస్తున్న జిల్లా పంచాయతీరాజ్ అధికారులు

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- డబ్బ గ్రామంలో మిషన్ భగీరథ అధికారులతో, కోరుట్లలో విద్యాశాఖాధికారులతో సమావేశం

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 13: నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ తాగునీటిని అందించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల అన్నారు. బుధవారం మండలంలోని డబ్బ వాటర్ గ్రిడ్ వద్ద మిషన్ భగీరథ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకు ముందు వాటర్ గ్రిడ్ నీటిని ఫిల్టర్ చేసే విధానాన్ని పరిశీలించి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి, నోట్‌బుక్స్, పెన్నులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ మంచినీటిని అందించారన్నారు. అధికారులు గ్రామాల్లోని ప్రతి ఇంటికీ మంచినీరు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో ప్రజలకు మంచినీటిని అందించాలన్నారు. అలాగే జిల్లా పంచాయతీ రాజ్ అధికారులు, జోగిన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు డబ్బ వాటర్ గ్రిడ్ వద్ద ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కంఠం భారతి, సర్పంచ్ లింగంపల్లి గంగాధర్, వైస్ ఎంపిపి నోముల లక్ష్మారెడ్డి, ఎస్ఈ రవీందర్, ఈఈ వాటర్ గ్రిడ్ శేఖర్‌రెడ్డి, ఈఈ ఇంట్రా ఆర్ సతీశ్, డీఈలు ఆనంద్, ప్రేమ్‌కుమార్, జిల్లా పంచాయతీ రాజ్ అధికారి దేవరాజ్, డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీవో కృపాకర్, మిషన్ భగీరథ ఈఈలు రాజేందర్, వకీల్, మల్లేశ్, రాజు, శ్రీనివాస్, నాయకులు కంఠం రమేశ్, నేమూరి సత్యనారాయణ, జేడీ సుమన్, రవికాంత్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జీవన్, పుప్పాల నర్సయ్య, రాజాగౌడ్, నేమూరి నరేందర్, బుచ్చిరెడ్డి, నగేశ్, అంబేద్కర్, శ్రీనివాస్‌రెడ్డి, స్వామిరెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

### మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి

కోరుట్ల, డిసెంబర్ 13: నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలకు చెందిన విద్యాశాఖ అధికారులు, జిల్లా నోడల్ ఆఫీసర్ నారాయణ, జిల్లా వైద్యాధికారి జగన్మోహన్‌రెడ్డితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు, విద్యార్థుల సంఖ్య, ఆయా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, పాఠశాలల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన మండల విద్యాధికారులు గంగుల నరేశం, ఆనందరావు, వాసం భూమయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కేజీవీబీ, మైనార్టీ పాఠశాలలకు చెందిన ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మల్లాపూర్, డిసెంబర్ 13: మండల కేంద్రానికి చెందిన గొట్టిపడ్డ రాజు అనే వ్యక్తి జీవనోపాధికి గల్ఫ్ దేశమైన సౌదీ అరేబియాకు వెళ్లగా అక్కడ తీవ్ర అనారోగ్యానికి గురైయ్యాడు. రాజుకు అక్కడ చికిత్స ఖర్చులు, స్వదేశానికి రావడానికి రూ. 5 లక్షల మేర కావాల్సి ఉంది. కాగా వీరి కుటుంబ సభ్యులను బుధవారం కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకొని రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాజును స్వదేశానికి తీసుకురావడానికి ప్రత్యేక చొరవ తీసుకుంటానని భరోసా కల్పించారు. ఇక్కడ ఎంపీపీ కాటిపల్లి సరోజన, జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ ఆకుతోట రాజేశ్, గ్రామ శాఖ అధ్యక్షుడు బండి లింగస్వామిగౌడ్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## 17న జిల్లా జట్టు ఎంపిక పోటీలు

కోరుట్ల, డిసెంబర్ 13: ఈనెల 23వ తేదీన కామారెడ్డి జిల్లాలో జరిగే తొమ్మిదో రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ పరుగుల పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపిక పోటీలను ఈనెల 17న పట్టణంలో ఐలాపూర్ రోడ్డులో ఉన్న కేరళ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఏలేటి ముత్తయ్యరెడ్డి, ఉపాధ్యక్షుడు అంజయ్య, కోశాధికారి కొమురయ్య బుధవారం తెలిపారు. 16 సంవత్సరాల్లోపు బాలబాలికలకు రెండు కిలోమీటర్ల పరుగు పందెం, 18 సంవత్సరాల్లోపు బాల బాలికలకు 6-4 కిలోమీటర్లు, 20 సంవత్సరాల్లోపు బాల బాలికలకు 8-6 కిలోమీటర్ల పరుగు, పురుషులు, మహిళలకు 10 కిలోమీటర్ల పరుగు పందెంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఎమ్మార్వో జారీ చేసిన జనన ధ్రువపత్రాలతో ఈనెల 17న ఉదయం 7 గంటలకు పట్టణంలోని ఐలాపూర్ రోడ్డులోని కేరళ హైస్కూల్‌లో రిపోర్టు చేయాలని సూచించారు. ఇక్కడ కార్యవర్గ సభ్యుడు శంకర్, కేరళ హైస్కూల్ కరస్పాండెంట్ మహ్మద్ అబ్దుల్ బారీ ఉన్నారు.

## పెగ్గెర్లలో అయ్యప్పస్వామి జాతర

కథలాపూర్, డిశంబర్ 13: పెగ్గెర్ల గ్రామంలో బుధవారం శ్రీఅయ్యప్ప స్వామి జాతర ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి దీక్షాపరులు భజనలు చేశారు. అయ్యప్పస్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జవిడి ప్రతాప్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు పాల్తెపు గంగారాం, గురుస్వామి పూంన్ద్ర భూమారెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సురేశ్

కొడిమ్యాల, డిసెంబర్ 13: చెప్యాల గ్రామానికి చెందిన ముదిగంపల్లి సురేశ్ ఉస్మానియా యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అర్హత సాధించారు. టీఎస్ సెట్ 2023లో అర్హత పరీక్ష సాధించినందున హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపిక కాగా సురేశ్‌ను గ్రామస్తులు బుధవారం అభినందించారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించాలి



ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి మండల సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పెగడపల్లి, డిసెంబర్ 13: ప్రభుత్వ అధికారులు పూర్తి జవాబుదారీతనంతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేయాలని ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఎంపీపీ గోళి శోభ-సురేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. మండల సమావేశాలకు అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో రావాలని, సమావేశంలో సభ్యులు అడిగిన సమస్యలకు పరిష్కారం దిశగా అధికారులు పని చేయాలని స్పష్టం చేశారు. మిషన్ భగీరథ నీళ్లు సరిగా రావడం లేదని పలువురు సభ్యులు సమావేశంలో ప్రస్తావించగా, తాగునీటికి సంబంధించి ఉన్నతాధికారులతో సమీక్షించి శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తానని వివరించారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పూర్తి స్థాయిలో కృషి చేస్తానని వివరించారు. ఎమ్మెల్యేగా గెలుపొందాక మొదటి సారిగా మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. మండల పరిషత్, రెవెన్యూ, ఈజీఎస్, ఐసీడీఎస్, సెర్ప్, విద్య, వైద్య, ఇంజినీరింగ్, తదితర శాఖల అధికారులు ఎమ్మెల్యేను సన్మానించారు. అంతకముందు ఎమ్మెల్యే మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కాసుగంటి రాజేందర్‌రావు, వైస్ ఎంపీపీ గాజుల గంగాధర్, నంచర్ల విండో చైర్మన్ మంత్రి వేణుగోపాల్, కో-ఆప్షన్ సభ్యుడు రహీం, ఎంపీడీవో పుల్లయ్య, తహసీల్దార్ ఎంఏ ఫారుఖ్, ఎంపీవో మహేందర్, డీఈ మురళి, ఏడీఏ వరుణ్‌కుమార్, ఐసీడీఎస్ సీడీపీవో నర్సింగరాణి, మండల అధికారులు చక్రధర్, శంషేర్ అలీ, ఆదిత్య, శ్రీనివాస్, రాంబాబు, వేణు, సమత, మహేశ్వరి, సుభద్ర, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

## 15న ధర్మపురిలో బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశం

ధర్మపురి, డిసెంబర్ 13: పట్టణంలోని శ్రీ లక్ష్మీనృసింహ గార్డెన్స్‌లో ఈ నెల 15న బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ఈ ఆత్మీయ సమావేశానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరుకానున్నట్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని పార్టీ మండలాధ్యక్షుడు మొగిలి శేఖర్ కోరారు.

## కోరుట్లలో సంజయ్ గెలుపుపై కోడె మొక్కు చెల్లింపు



వేములవాడలో కోడె మొక్కు చెల్లిస్తున్న నాయకులు

మల్లాపూర్, డిసెంబర్ 13: కోరుట్ల ఎమ్మెల్యేగా సంజయ్ కల్వకుంట్ల గెలుపొందడంపై వీవీ రావుపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బిట్ల నరేశ్, మచ్చర్ల దశరథ్ రెడ్డి వేములవాడ రాజన్న ఆలయంలో బుధవారం కోడె మొక్కులు చెల్లించుకున్నారు. సంజయ్ ఎమ్మెల్యేగా గెలుపొందాలని కోరుతూ ఎన్నికల కు ముందు ఆలయంలో ముడుపు కట్టామని తెలిపారు.

## విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం

కొడిమ్యాల, డిసెంబర్ 13: మండల కేంద్రంలో నిర్మిస్తున్న శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం వేదపండితుల సమక్షంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జగన్నాథం విష్ణువర్ధనాచార్యులు బృందం సభ్యులు, ఆలయ పూజారి నాగరాజు రమేశ్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణ ప్రారంభం

కొడిమ్యాల, డిసెంబర్ 13: మండల కేంద్రంలో నాబార్డ్ సహకారంతో ఐఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణా కేంద్రాన్ని సర్పంచ్ ఏలేటి మమత బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు ఉచిత మగ్గం శిక్షణను ఉపయోగించుకొని లబ్ధి పొందాలన్నారు. నాబార్డు డీడీఎం మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ, 15 రోజులపాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు, ఉచిత భోజన సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రసాద్, ఎంపీటీసీ జమాల్‌పూరి రాజేశ్వరి, సింగిల్ విండో చైర్మన్ మేన్నేని రాజనర్సింగరావు, సెర్ప్ అదనపు డీఆర్డీవో సుధీర్‌కుమార్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మల్లేశం, వెంకటేశ్, విజయభారతి, ఇన్‌చార్జి ఏపీఎం వొడ్నాల రాజు, సీసీలు పద్మ, వీరకుమార్, స్వరూప, మండల సమాఖ్య అధ్యక్షురాలు గౌతమి తదితరులున్నారు.

## రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

ధర్మపురి, డిసెంబర్ 13: బుగ్గారం మండల కేంద్రానికి చెందిన నగునూరి హరీశ్ అనే విద్యార్థి అండర్-15 విభాగంలో రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపి సిల్వర్ మెడల్ సాధించినట్లు కిక్ బాక్సింగ్ కోచ్ మామిడిపెల్లి గణేశ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి హరీశ్‌ను కిక్ బాక్సింగ్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కస్తూరి ప్రవీణ్, కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు అభినందించారు.

## లింగాపూర్ ఇన్‌చార్జి సర్పంచ్ బాధ్యతల స్వీకరణ

పెగడపల్లి, డిసెంబర్ 13: లింగాపూర్ గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాల్సాని హారిక-శేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు గ్రామ సర్పంచ్‌గా ఉన్న ఈరెల్లి శంకర్ నవంబర్ 15న గుండె పోటుతో మరణించగా, జిల్లా పంచాయతీ అధికారులు ఉప సర్పంచ్ హారికను ఇన్‌చార్జి సర్పంచ్‌గా నియమించారు. పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, ఉప సర్పంచ్ హారికకు సర్పంచ్‌గా బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పూసాల శోభ-తిరుపతి, ఎంపీడీవో పుల్లయ్య, ఎంపీవో మహేందర్, పంచాయతీ కార్యదర్శి లావణ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లు

సారంగాపూర్, డిసెంబర్ 13: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో ఐకేపీ సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి కాగా మరికొన్నిచోట్ల ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరుగుతున్నాయని ఏపీఎం రాజయ్య బుధవారం తెలిపారు. సారంగాపూర్‌లో 6,095 క్వింటాళ్లు, లక్ష్మీదేవిపల్లిలో 4,520 క్వింటాళ్ల, పెంబట్లలో 7,200 క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు చేయగా మూడు గ్రామాల్లో కొనుగోళ్లు పూర్తయ్యాయన్నారు. మిగితా సెంటర్లలో ఇప్పటి వరకు రేచపల్లిలో 8,229 క్వింటాళ్లు, లచ్చునాయక్ తండాలో 5,428, అర్పల్లిలో 8,242, రంగపేటలో 1,389 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. బీర్‌పూర్ మండంలో మంగెళ గ్రామంలో 1,806 క్వింటాళ్లు, కొల్వాయిలో 3,196 క్వింటాళ్లు, నర్సింహులపల్లిలో 1,670 క్వింటాళ్ల ధాన్యం ఇప్పటి వరకు కొనుగోలు చేసినట్లు వివరించారు. ఇప్పటి వరకు సారంగాపూర్ మండలంలో మొత్తం 41,099 క్వింటాళ్లు, బీర్‌పూర్ మండలంలో 6,672 క్వింటాళు కొనుగోలు చేసినట్లు ఏపీఎం రాజయ్య పేర్కొన్నారు.